

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 39 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 09, జనవరి 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# అక్రమ వ్యాపార దందాకు.. అందరి వత్తాసు !


● అక్రమ ఇసుక దందా అక్రమ ● ఇటుక దందాకు ఎక్కడలేని మద్దతు ● ప్రతి నియోజకవర్గంలో ఇసుక మొరం ● దందలు బరితెగించి పోతున్నాయి ● రాత్రింబగళ్లు ఒకటే తోడుడు ● ఇసుక మాఫియాకు సంపూర్ణ మద్దతిస్తున్న పోలీసులు ● గ్రామాలను గుత్తపట్టుకుంటున్న నకిలీ రాజకీయ నాయకులు ● అన్ని తెలిసినా మౌనంగా ఉంటున్న రెవెన్యూ ● ఇరిగేషన్ శాఖలు ● ఇందిరమ్మ ఇండ్ల పేరు చెప్పి ఎక్కడలేని వ్యాపారం చేస్తున్నారు ● పోలీసులు రాజకీయ నాయకులు ముఠాలుగా ఏర్పడి దంద చేస్తున్నారు ● ఎటు చూసినా సామాన్య ప్రజలే బలిపశులవుతున్నారు ● ప్రభుత్వానికి పట్టింపు లేదు మంత్రికి సోయిలేదు ● డాక్టర్ బరిగెల శివ








హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)




డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, ఛైర్మన్

రాష్ట్రంలో పెరిగిపోతున్న అక్రమ ఇసుక రవాణా దందా అక్రమ మొరం దందా అక్రమ ఇటుక దందాకు కారకులను శిక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఇందిరమ్మ ఇండ్ల పేరు మీద ఇసుక తవ్వకాలు,మొరం తవ్వకాలు,ఇటుక తయారీలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు.ప్రభుత్వ వ్యవస్థల అనుమతులు లేకుండానే ఎవరికి తోచిన విధంగా వాళ్ళు నకిలీ వ్యాపారానికి ఎగబడుతున్నారని తీవ్రంగా మందలించారు.ప్రతి మండలంలో లెక్క ప్రకారం కట్టబడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తామని హామీ ఇవ్వగా వాటి బాధ్యతలను తీసుకోవాల్సిన సంబంధిత ప్రభుత్వ అధికారులు చేతులెత్తేసి నకిలీ రాజకీయ నాయకులకు అధికార బాధ్యతలు అప్పజెప్పినట్లుగా రాత్రింబగళ్లు ఇసుక తవ్వకాలు మొరంతవ్వకాలు ఇటుక తయారీలు విపరీతంగా చేస్తున్నారని విమర్శించారు.రోజువారీగా ప్రతి మండల కేంద్రాల్లో ఎన్ని ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు,మొరం తవ్వకాలు జరుగుతున్నాయో పసిగట్టాల్సిన ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగాలు ముడుపులకు ఆశపడి స్థానిక రాజకీయ నాయకుల అండదండలతో యదేచ్చగా వ్యాపారం చేస్తున్నారని వాళ్లు ఆడిందే ఆట పాడిందే పాటగా అక్రమ దందా చేస్తూ ఉండడంవల్ల సాధారణ ప్రజలపై తీవ్రమైన భారం పడుతుందని దానిని ప్రభుత్వం గమనించలేకపోవడం విచారకరంగా







- మిగతా 2లో..

## మెస్ సమస్యలు పరిష్కరించాలి

కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ముట్టడి



5



## మోదీ సర్కారుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేసేవారని ఆరోపణ

కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని వెల్లడి

మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తానంటే అంగీకరించేది లేదన్న ముఖ్యమంత్రి

7

## ప్రేమించిన యువకుడు అనుమానించాడని..

వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకి యువతి ఆత్మహత్య

నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన



2

## హాస్టల్స్ కమిటీ విచారణ వేగవంతం


పలు అంశాలను లోతైన కోణంలో విచారిస్తున్న కమిటీ

ఖితపూర్వకంగా అంశాలపై ఆధారాలు సేకరణ

విచారణ ఆధారాలను సేకరించి భద్రపరచుకున్న కమిటీ ఛైర్మన్

కమిటీ నివేదిక ఆదర్శంగా ఉండేనా అమ్ముడుపోయేనా !

వీరమళ్ళ నిరంజన్ రెడ్డి అకౌంట్స్ అన్నిటిని విచారించనున్న కమిటీ







కేయూ క్యాంపస్ జై భీమ్ న్యూస్:-

కేయూ హాస్టల్స్ అవినీతి అక్రమాలపై నిజ నిజాలను నిగ్గు తేల్చేందుకు కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కే. ప్రతాపరెడ్డికి విద్యార్థి సంఘాల నేతలు సమర్పించిన వినతి పత్రాలు ఆధారంగా కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వీ రామచంద్రం 29/11/2025 తేదీ కేయూ ఆర్డర్స్ నెం.990/ఖ2/కేయూ/2025/కమిటీ-439 న కమిటీ వేసి తద్వారా ఏర్పాటు చేయబడిన కమిటీ ఆధారంగా విచారణలో భాగంగా, విచారణ సజావుగా సాగడానికి విద్యార్థులు లేవనెత్తిన కింది అంశాలకు సంబంధించిన అంశాలను విచారణ చేయడానికి హాస్టల్స్ డైరెక్టర్ ను అంశాల ఆధారాలను సేకరించడం కోసం అభ్యర్థించారు.ప్రధానంగా యూనివర్సిటీ హాస్టల్స్ అకౌంట్ కు ఏ ఏ విభాగాల నుండి ఎంతెంత సొమ్ము జమ చేయబడినదో అట్టి సొమ్మును హాస్టల్స్ నిర్మాణం కొరకు ఖర్చు

- మిగతా 2లో..

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem TV

# ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం 2026 డైరీ ఆవిష్కరణ





**వరంగల్, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం నూతన సంవత్సరం2026 డైరీని గౌరవ వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కే.ఆర్. నాగరాజు గారు మరియు రాష్ట్ర ఆయిల్ ఫీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి గారు ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో మరణించిన పోలీస్ అధికారుల స్మృతికి గౌరవంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం సంఘ సభ్యులకు హెల్త్ కార్డులు పంపిణీ చేసి, 2026 డైరీని అధికారికంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు గారు మాట్లాడుతూ సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం జీవితాంతం అంకితభావంతో సేవలందించిన విశ్రాంత పోలీస్ అధికారుల సేవలు చిరస్మరణీయమని అన్నారు. విధి నిర్వహణలో ప్రజల భద్రతకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చిన పోలీస్ అధికారులు సమాజానికి ఆదర్శమని ప్రశంసించారు. విశ్రాంతి అనంతరం కూడా సంఘాల ద్వారా ఐక్యంగా ఉండి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే, నూతన సంవత్సరం2026 సందర్భంగా విశ్రాంత పోలీస్ అధికారులందరికీ ఆరోగ్యం, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘానికి రూ.5 లక్షల విరాళం అందజేస్తానని ప్రకటించారు. సంఘ భవన స్థలం కోసం స్థానిక ఎమ్మెల్యేతో కలిసి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. "మీ అంతా నా కుటుంబ సభ్యులే; అవసరమైనప్పుడు నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను" అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంజీవ్ రెడ్డి, సంఘ ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్ హైస్కూల్‌కు ఆలస్యంగా అక్షయపాత్ర భోజనం విద్యార్థులకు ఇబ్బందులు

### పదవ తరగతి విద్యార్థులకు రెండు నెలల పాటు స్నాక్స్ అందించాలి ఏఐఎఫ్‌డీఎస్ వరంగల్ జిల్లా కమిటీ



**వరంగల్, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ తూర్పు 26వ డివిజన్‌లోని లక్ష్మీపూర్ హైస్కూల్‌ను గురువారం ఏఐఎఫ్‌డీఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య) ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి చుక్క ప్రశాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద, మధ్యతరగతి విద్యార్థులే చదువుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం 12:30 గంటలకు అందించాల్సి ఉండగా, ప్రైవేటు సంస్థ అయిన అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా భోజనం సుమారు 1:20 గంటలకు ఆలస్యంగా చేరుతోందని, దీని వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో పాఠశాలలలోనే మిడ్‌డే మీల్స్ వండిపెడితే నాణ్యమైన భోజనం సమయానికి అందేదని గుర్తుచేశారు. అదేవిధంగా, విద్యార్థులకు అందాల్సిన గుడ్లు గత మూడు వారాలుగా ఇవ్వడం లేదని విద్యార్థులు వాపోయారని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో నల్లాల నుంచి నీరు నిరంతరం వృథాగా పోతున్నా పట్టించుకునే వారు లేరని విమర్శించారు. కాబట్టి తక్షణమే మధ్యాహ్న భోజన నిర్వహణను మిడ్‌డే మీల్స్ సిబ్బందికే తిరిగి అప్పగించాలని, అలాగే పదవ తరగతి విద్యార్థులకు రెండు నెలల పాటు స్నాక్స్ అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం చేయకపోతే, ఏఐఎఫ్‌డీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేనిష్ నాయక్, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ 'వ్యాపార' దందాకు అందరి వత్తాసు

ఉందన్నారు. పేద వాళ్ళ పేర్లు చెబుతూ అక్రమ దందా చేయడం స్థానిక నాయకుల హస్తం లేకుండానే జరుగుతుందా అంటూ మండిపడ్డారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల మౌన ప్రదర్శనతో పాటు కొంతమంది పోలీస్ అధికారులు స్థానిక నకిలీ నేతలు ముఠాలుగా ఏర్పడి అక్రమ ఇసుక దందకు అక్రమ మొరందదాకు అడ్డుపడుతున్న వ్యక్తులను తీవ్రంగా బాధలు పెడుతూ బరితెగించిన అక్రమ వ్యాపారాలను బహిరంగంగా చేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు పేదలకు అండగా ఉంటాం పేదల సంక్షేమం కొరకు పాటుపడతాం ప్రజల హక్కులను కాపాడుదాం సామాజిక విలువలకు కట్టుబడి ఉంటాం అంటూ ప్రకటనలు చేస్తూనే,ప్రతిజ్ఞలు చేస్తూనే ప్రమాణాలు చేస్తూనే స్థానిక నాయకులు కొనసాగిస్తున్న అక్రమ దందాను నేరుగా ప్రోత్సహిస్తున్నారని గుర్తుచేశారు. ఇలాంటి అక్రమ దందా దారులు నేరుగా ప్రభుత్వం పేరు చెబుతూ ఎక్కువ పైసలకు అమ్ముకుంటూ వ్యాపారాలు చేయడం నకిలీ రాజకీయ నాయకుల పన్నాగమే నంటూ గుర్తు చేశారు. అలాంటి బ్రోకర్ నాయాళ్లకు స్థానిక నేతలు పూర్తిగా సహకరిస్తున్నందువల్లనే పోలీస్ రెవెన్యూ ఇరిగేషన్ శాఖలు ఇంచుమించు ఇలాంటి విషయాలలో కండ్లు మూసుకునట్టుగా వ్యవహరిస్తున్నాయన్నారు. అక్రమాలకు సంబంధించిన విషయాలపై పోలీసు అధికారులే సమాచారం ఇవ్వండి అంటూ పలు సందర్భాల్లో ఉన్నతమైన ప్రకటనలు చేస్తున్నప్పుడు సాధారణ ప్రజలు ఇలాంటి అక్రమ దందా అక్రమ వ్యాపారాలపై పోలీసులకు సమాచారం చేరవేస్తే అట్టి సమాచారాన్ని రహస్యంగా ఉంచాల్సిన పోలీసులు నకిలీ రాజకీయ నాయకులకు తెలపడంతో పాటు వాళ్లచే దాడులు చేయిస్తూ సమాచారం అందజేసిన వ్యక్తులనే మక్కిలిరిగేలా కొడుతున్నారన్నారు. అక్రమ ఇసుక దందా అక్రమ మొరందందా చేస్తున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాల్సిన పోలీసు అధికారులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో ఇప్పటివరకు ఎన్ని వాహనాలను ఎన్ని ట్రాక్టర్లను ఎన్ని లారీలీలను ఎన్ని టిప్పర్లను ఎన్ని జెసిబిలను,ఎన్ని ప్రోక్లైన్లను సీజులు చేస్తూ కేసులు కట్టారో స్టేషన్ల వారీగా ప్రజలకు జవాబు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. పేద ప్రజలకు దక్కాల్సిన హక్కులన్నిటిని నకిలీ గాళ్లు దంచుకుపోతుంటే ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలు ఏమాత్రం నిజాయితీని పాటించకపోవడం బాధాకరంగా ఉందన్నారు. పేదల పేరు చెప్పి వ్యాపారం చేసే మూర్ఖులకు పైస సంపాదన ఒకటి మాత్రమే కండ్లకు కనబడుతుంది తప్ప ఎంతమంది పేదల ఉసురు పోసుకుంటున్నారో ఏమాత్రం పసిగట్టలేకపోతున్నారన్నారు. ఒకరకంగా చెప్పాలంటే పేదల పొట్టగొడుతూ అక్రమంగా వ్యాపారాలు చేయడం గతంలో ఎన్నడూ చూడని దుర్మార్గం లాంటిది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇల్లు కట్టిస్తుంటే నకిలీ నాయకులు సంబంధించిన పనులను అడ్డం పెట్టుకొని వ్యాపారాల పేరుమీద దోచుకుంటున్నారన్నారు. పేరు పేదలది సంపద నకిలీలది అనే విధంగా సాగుతున్న అక్రమ ఇసుక దందాను అక్రమం మొరం దందాను ఆపగల శక్తి ఈ రాష్ట్రంలో ఎవరికైనా ఉందా అంటూ సూటిగా ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలు పకడ్బందీగా అమలు కాకపోవడానికి ఇలాంటి దౌర్భాగ్యపు అక్రమ వ్యాపారాలే ప్రధాన కారణాలన్నారు. ప్రజలను వేధించి ప్రజలను గోసబెట్టుకొని ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ అక్రమంగా వ్యాపారాలు చేస్తున్న వ్యక్తులందరూ నకిలీ నాయకులందరూ గ్రామస్థాయి నాయకులకు సెక్రటరీలకు మండల స్థాయి అధికారులకు పోలీసు అధికారులకు తెలిసినప్పటికీ వారిపై చర్యలు తీసుకోవడంలో వారిని శిక్షించడంలో మాత్రం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోవడం విచారకరమన్నారు. సామాన్యులపై జూలు విధించే అధికారులు ఇలాంటి అక్రమ దందా వ్యాపారులను మాత్రం అక్కున చేర్చుకోవడం అధికార వృత్తికి పూర్తి విరుద్ధమన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు సేవ చేస్తున్నారా నకిలీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారా గమనించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతంగా జరుగుతుందని ప్రజాప్రతినిధులు ప్రకటిస్తుంటే సాధారణ ప్రజలు హరిగోశపడుతున్నారని గ్రామాలు మొత్తుకుంటున్నాయన్నారు. ముందున్నంత ఓపిక ముందున్నంత శ్రద్ధ ముందున్నంత పట్టుదల ముందున్నంత ఆసక్తి ప్రస్తుతం పేద ప్రజలు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లపై రాజకీయ నాయకులకు లేదని అది ఏ మాత్రం కనిపించడం లేదన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలలో రాష్ట్రవ్యాప్తంగా దళారీ వ్యవస్థలు డబ్బులు వసూలు చేస్తున్నారని చాలా చోట్ల సోషల్ మీడియాలో బహిరంగంగా కనిపిస్తున్నప్పటికిని అధికార యంత్రాంగం మాత్రం వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదంటూ ఏమాత్రం పరిగణలోనికి తీసుకోవడం లేదంటూ తెలిపారు. పేద ప్రజలకు దక్కాల్సిన హక్కులన్నీ రాజకీయాన్ని అడ్డం పెట్టుకొని లబ్ధి పొందాలనే క్రమంలో పార్టీలు మారి అధికార పార్టీలోకి చేరిన నకిలీ ముటాలే ఇలాంటి వ్యాపారాలకు పాల్పడుతూ గత ప్రభుత్వంలో 10 సంవత్సరాలు ప్రస్తుత ప్రభుత్వంలో రెండు సంవత్సరాలు యధావిధిగా వ్యాపారాలు చేస్తూనే ఉన్నారని గుర్తు చేశారు. పార్టీలు మారితే పాపాలు ,నేరాలు మోసాలు పోతాయనే స్థాయికి నేటి రాజకీయాలు పడిపోయినాయని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి నుండి మొదలుకొని పట్టణ స్థాయి వరకు ప్రతి చోట జరుగుతున్న అక్రమ ఇసుక దండ అక్రమ మొరం దందా అక్రమ ఇటుక దందాపై అన్ని జిల్లాల కలెక్టర్లు అన్ని జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు ఉక్కుపాదం మోపి సాధారణ ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు. రాత్రింబగళ్లు కొనసాగుతున్న ఇలాంటి అక్రమ దందా వల్ల రాష్ట్రవ్యాప్తంగా విపరీతమైన కాలుష్యం పెరిగిపోతుందని దానివల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని గుర్తు చేశారు. దానిని పూర్తిగా నియంత్రించాలంటే తక్షణ చర్యలో భాగంగా వీటిని అరికట్టాల్సిందే నంటూ ప్రభుత్వానికి గుర్తు చేశారు.

# హాస్టల్స్ కమిటీ విచారణ వేగవంతం

మొదటి పేజీ తరువాయి

చేసిన విధానంలో జరిగిన లోటుపాట్లను, అవినీతి అక్రమాలను హాస్టల్స్ నియమాలకు విరుద్ధంగా ఖర్చు చేసిన విధానాలను కమిటీ లోతైన విచారణ చేపట్టనున్నట్లు విశ్వాసనీయ సమాచారం. పలు ప్రధాన అంశాలను సేకరించి వాటికి సంబంధించిన ఆధారాలను హాస్టల్స్ కార్యాలయం నుండి తీసుకొని జాగ్రత్తగా పొందుపరచుకున్నట్లు విశ్వాసనియా సమాచారం. కమిటీ చైర్మన్ ఆచార్య ప్రసాద్ బృందం విచారణను వేగవంతం చేస్తూనే లోతైన స్థాయిలో హాస్టల్ నిర్మాణం కొరకు జరిగిన ప్రతి కదలికను విచారిస్తున్నట్లు విద్యార్థి సంఘాలు తెలియజేస్తున్నారు. ప్రధానంగా పార్ట్ టైం అధ్యాపకులు అనధికార హోదాలో జాయింట్ డైరెక్టర్లుగా కొనసాగుతూ అడ్డగోలుగా అడ్వాన్సులు తీసుకున్నారని క్షేత్రస్థాయి అభియోగాలు వినిపిస్తున్నాయి. ఫార్మసికి చెందిన ఒక జాయింట్ డైరెక్టర్ సుమారు 46 అడ్వాన్సులు తీసుకున్నట్లు విశ్వాసనీయ సమాచారం. వీటన్నిటిని పరిశీలిస్తూ అడ్డకాడి కూలీల మొత్తం సంఖ్య వాళ్లకు జీతాలు చెల్లించిన వ్యక్తిపై క్షేత్రస్థాయి అభియోగాలు కలవని దానిపై లోతుగా విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**ప్రధాన అంశాలపై విచారణ**

1. బోర్డర్లు, పునరుద్ధరణల జాబితాలను విచారించుట కొరకు.

2. అడ్డా లేబర్ (రోజువారీ మొత్తం శ్రమ, హాజరు ప్రక్రియ చెల్లింపు ఎలా చేయబడినదో తెలుసుకునుటకు)

3.స్కావెంజర్లు (రోజువారీ మొత్తం శ్రమ, హాజరు ప్రక్రియ, చెల్లింపు ఎలా చేశారు)

4. జెడీలు ,కేర్ టేకర్లు వంటి వారందరికీ 10 నెలల అడ్వాన్సులు, జీఎస్టీ బిల్లులు వంటి బిల్లుల సమస్యలు (సెటిల్మెంట్ల గురించి వివరాలను పరిశీలించుట కొరకు - అడ్వాన్సుల ప్రయోజనం కోసం తనిఖీ చేయుట కొరకు).

5. కొత్త పీజీ హాస్టళ్లలో అన్ని వంటగది వస్తువుల కొనుగోలు మెస్- అనుసరించిన విధానం ఏమిటి?వాటి వివరాల విచారణ కొరకు.

6. టెండర్స్ కమిటీ (కొత్త) టెండర్ గడువు ముగిసిన విధానాలపై విచారణ కొరకు.

7. పద్మాక్షి హాస్టళ్లలో నకిలీ మెస్ కార్డులు (నవీన్ పాత్ర?) అకాంట్ నంబర్స్.

8. ఎండీ పాషా వస్తువుల సరఫరాలో పాత్ర? స్థావరాలు ,అకౌంట్స్ లెక్కింపు కొరకు.

9. అడ్వాన్సులు, అడ్వాన్సుల పరిష్కారంతో సహా 10 నెలల మొత్తం ఖాతా స్టేట్‌మెంట్‌లు?

10. షోబన్ ఎలక్ట్రికల్ మరమ్మతు, సంబంధిత సమస్యలు? విచారణ కొరకు.

11. నవీన్ కంప్యూటర్ ఇటీవల (లేదా ఉద్దేశపూర్వకంగా) షార్ట్ ఎంపికతో ఎందుకు పోయింది. వివరాల సేకరణ విచారణ కొరకు.

12. చేరలు అనే కలపదారు సరఫరా మోసం కారణంగా రద్దు చేయబడ్డాడు, సరఫరా చేయాల్సిన అవసరం లేదు, కానీ అతని సరఫరా ఎందుకు అంగీకరిస్తోంది (లోడ్ చేయబడిన అన్‌లోడ్ చేయబడిన కట్టెల స్లిప్‌ల కోసం తనిఖీ చేయండి).

13. గత 10 నెలల మెస్ సెక్రటరీల ఆర్డర్‌లను తనిఖీ చేసి విచారించుట కొరకు.

14. కళాశాలల ప్రిన్సిపల్స్ నుండి అందుకున్న మొత్తం మొత్తం, యుటిలైజేషన్ షీట్ విచారణ కొరకు.

15. ప్రతిరోజూ పేపర్ ప్లేట్ల వాడకాన్ని ఎందుకు అనుమతిస్తున్నారు?విచారించుట కొరకు.

16. అన్ని ఆహార పదార్థాల స్టాక్ రోజువారీ సమస్యల రికార్డు, తదుపరి మెస్ కార్యదర్శులలో నెలవారీ రికార్డుల అందజేయడం వంటి విచారణ కొరకు.

17. వెంకటేశ్వర ఐరన్ హార్డ్ వేర్, సర్వేశ్వర సరఫరాదారులు,విజయలక్ష్మి కిరణం, తవక్కల్ కిరణం వంటి సరఫరాదారులను తనిఖీ చేయడానికి విచారణ కొరకు.

18. నవంబర్ , డిసెంబర్ 2025 సాధారణ మెస్ బిల్లులను తనిఖీ చేయడానికి. జనరల్ బిల్లులను మెస్ బిల్లులలో ఏ విధంగా కలిపినారు ప్రచారించడం కొరకు

అన్నింటికన్నా ప్రధానంగా వీరమళ్ళ నిరంజన్ రెడ్డి అను వ్యక్తి చెందిన సుమారు మూడు అకౌంట్స్ నెంబర్లను విచారించుట కొరకు. పైన తెలుపబడిన అంశాలపై కమిటీ లోతైన కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లుగా యూనివర్సిటీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అప్పుడే కమిటీపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తూ ఎలాగైనా కమిటీని నిలుపుదల చేయాలని విచారణ సాగకుండా అడ్డుకోవాలని అవినీతి అక్రమాలకు పాల్పడిన వ్యక్తులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు విద్యార్థి సంఘాల ఆరోపిస్తున్నాయి. పనికిమాలిన వార్తలను రాసే పత్రికలన్నీ కవర్లకు ఆశపడి హాస్టల్ అవినీతి అక్రమాలపై వార్తలు రాయడం లేదని విద్యార్థి సంఘాలు తీవ్రంగా విమర్శిస్తూ పలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. విచారణ సజావుగా సాగేనా పైరవీలకు, అధికారులకు అమ్ముడుపోయేనా అంటూ అప్పుడే జోరుగా చర్చ సాగుతుంది.




# ప్రొఫెసర్ బి. సురేష్ లాల్ రచించిన "రివర్స్ అఫ్ గ్రేస్" గ్రంథావిష్కరణ

**హన్మకొండ, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి చేతుల మీదుగా, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు, అర్థశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ బి. సురేష్ లాల్ రచించిన రివర్స్ అఫ్ గ్రేస్ (రివర్స్ ఆఫ్ గ్రేస్) అనే గ్రంథాన్ని యూనివర్సిటీ పరిపాలన భవనంలో ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ చీఫ్ కన్వీనర్ డాక్టర్ అనిల్ కుమార్ ఠాకూర్తో కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ప్రొఫెసర్ బి. సురేష్ లాల్ గారు పలు జాతీయ, అంతర్జాతీయ అంశాలపై లోతైన పరిశోధనలు చేస్తూ అనేక వ్యాసాలు, పదుల సంఖ్యలో గ్రంథాలను రచించిన విశాల అనుభవం కలిగిన పరిశోధకుడని పేర్కొన్నారు. "రివర్స్ అఫ్ గ్రేస్" గ్రంథం మానవాళి మనుగడలో జల వనరుల అవసరంపై విస్తృతమైన విశ్లేషణతో పాటు సమకాలీన అంశాలను సమగ్రంగా పొందుపరిచిందని తెలిపారు. ఈ గ్రంథం సామాజిక శాస్త్ర పరిశోధకులకు మాత్రమే కాకుండా, అన్ని విభాగాల విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సిన ప్రాధాన్యతను కలిగి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో పాలకమండలి సభ్యురాలు కే. అనిత రెడ్డి, అర్థశాస్త్ర అధ్యాపకులు, పరిశోధకులు డాక్టర్ సాంబ శివరావు, డాక్టర్ వీరేందర్, డాక్టర్ రాజేష్, డాక్టర్ శ్రీధర్ కుమార్ లౌద్, డాక్టర్ హరి శంకర్, డాక్టర్ రవీందర్, డాక్టర్ నవీన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ వర్సిటీలో సంచలన ప్రశ్నపత్రాల లీకేజీ

**విచారణకు ఆదేశాలు నలుగురు సిబ్బంది సస్పెన్షన్, 35 మంది ఇన్‌సర్వీస్ విద్యార్థుల డిస్మిస్**

**వరంగల్, జనవరి 8, 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం తీవ్ర సంచలనంగా మారింది. ఈ కుంభకోణానికి సంబంధించి విశ్వవిద్యాలయం అంతర్గత విచారణకు ఆదేశాలు జారీ చేయగా, ఒక ఉన్నతాధికారి సహా నలుగురు వర్సిటీ సిబ్బందిని సస్పెండ్ చేసింది. అదే సమయంలో ఇన్‌సర్వీస్ కోటాలో చదువుతున్న సుమారు 35 మంది మూడో సంవత్సరం బీ.ఎస్సీ (అగ్రికల్చర్) అభ్యర్థుల ప్రవేశాలను రద్దు చేస్తూ వారిని తిరిగి వ్యవసాయ శాఖకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఉపకులపతి అల్దాస్ జానయ్య ఇతర అధికారులతో కలిసి జగిత్యాల వ్యవసాయ కళాశాలను సందర్శించి, రికార్డులు, సీసీటీవీ ఫుటేజ్‌లను పరిశీలించారు. ఈ పరిశీలనలో సెమిస్టర్ ఫైనల్ పరీక్షల ప్రశ్నపత్రాలు లీక్ అవుతున్నాయన్న అనుమానాలు బలపడటంతో ముగ్గురు అధికారులతో కూడిన విచారణ కమిటీని నియమించారు. కమిటీ అన్ని కోణాల నుంచి విచారణ చేపట్టి, వ్యవసాయ శాఖలో ఏఈవోలుగా పనిచేస్తూ ఇన్‌సర్వీస్ కోటాలో మూడో ఏడాది బీ.ఎస్సీ అగ్రికల్చర్ చదువుతున్న సుమారు 35 మంది అభ్యర్థులు, ఒక పథకం ప్రకారం వర్సిటీ సిబ్బంది సహకారంతో ప్రశ్నపత్రాలను లీక్ చేసి వాట్సాప్ గ్రూపుల ద్వారా ఇతర వ్యవసాయ కళాశాలల విద్యార్థులకు పంపుతున్నట్టు నిర్ధారించింది. ఈ వ్యవహారంలో భారీగా డబ్బు లావాదేవీలు జరిగినట్టు కూడా తేలింది. గత కొన్నేళ్లుగా ఈ అక్రమం కొనసాగుతున్నట్టు కమిటీ నివేదికలో పేర్కొంది. ఈ వ్యవహారాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించిన వర్సిటీ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటూ నలుగురు సిబ్బందిని సస్పెండ్ చేయడంతో పాటు, ఇన్‌సర్వీస్ కోటాలో వచ్చిన 35 మందిని డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

**"ప్రక్షాళనే తదుపరి కర్తవ్యం" ఉపకులపతి..**

ఈ సందర్భంగా ఉపకులపతి అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, 2014 నుంచి 2024 వరకు పూర్తి స్థాయి ఉన్నతాధికారులు లేకపోవడం వల్ల విశ్వవిద్యాలయంలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని, ప్రశ్నపత్రాల లీకేజీ కుంభకోణం అందులో ఒకటని అన్నారు. వెంటనే ప్రక్షాళన ప్రారంభించి బాధ్యులపై చర్యలు తీసుకున్నామని తెలిపారు. అవసరమైతే సైబర్ నేరాల విభాగానికి ఫిర్యాదు చేసి సమగ్ర విచారణ చేయాలని కోరతామని,




ఈ వ్యవహారానికి సంబంధించిన ఎవరినీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పరీక్షా విధానాన్ని సమగ్రంగా సమీక్షించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ సంస్కరణలు తీసుకువస్తామని, వ్యవసాయ విద్యలో నాణ్యతా ప్రమాణాలు పెంచుతామని ఉపకులపతి ప్రకటించారు.

# మనిషి రక్త బ్యాగుల్లో మేక రక్తం

**హైదరాబాద్ దాడిలో వెలుగులోకి వచ్చిన భయానక నిజాలు ఇంకా సమాధానం లేని ప్రశ్నలు**

**హైద్రాబాద్, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

కాచిగూడ ప్రాంతంలో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డిసిఎ) అధికారులు నిర్వహించిన దాడులు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఒక ఇంపోర్ట్‌ఎగుమతి సంస్థ ప్రాంగణంలో సుమారు 1,000 లీటర్ల గొర్రెలు, మేకల రక్తాన్ని అక్రమంగా సేకరించి, మానవ రక్తానికి వినియోగించే రక్త బ్యాగుల్లో నిల్వ చేసినట్టు అధికారులు గుర్తించారు. ఈ ఘటన వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్నది ఇప్పటికీ స్పష్టతకు రాకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డ్రగ్ కంట్రోల్ అధికారులు, హైదరాబాద్ పోలీస్, సెంట్రల్ డ్రగ్ కంట్రోల్ అధికారుల సమన్వయంతో ఈ దాడులు చేపట్టారు. గోప్య సమాచారం ఆధారంగా సీ.ఎన్.కే ఇంపోర్ట్‌ఎగుమతి కంపెనీని లక్ష్యంగా చేసుకుని తనిఖీలు నిర్వహించగా, అక్కడ లభించిన ఆధారాలు అధికారులను విస్మయానికి గురిచేశాయి. మానవ రక్తం కోసం తయారు చేసిన బ్యాగుల్లో జంతు రక్తాన్ని నిల్వ చేయడం చట్టపరంగా తీవ్రమైన నేరమని అధికారులు స్పష్టం చేశారు. దాడుల్లో లభించిన జంతు రక్తాన్ని హర్యానాకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీకి తరలిస్తున్నట్టు అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఈ రక్తాన్ని అనధికారిక క్లినికల్ ట్రయల్స్, ప్రయోగాత్మక అవసరాలు, లేదా ల్యాబ్ కల్చర్ మీడియా తయారీ కోసం వినియోగించి ఉండవచ్చని డ్రగ్ కంట్రోల్ అధికారులు భావిస్తున్నారు. తుది వినియోగం ఏదో ఇప్పటికీ నిర్ధారణ కాలేదని తెలిపారు. "ఇంత భారీ మొత్తంలో జంతు రక్తాన్ని ఎందుకు సేకరించారు? ఎక్కడ, ఎలా ఉపయోగించారు? అనేది దర్యాప్తులో కీలక అంశం," అని ఒక సీనియర్ అధికారి వ్యాఖ్యానించారు.

కాచిగూడ ప్రాంగణంలో జరిగిన తనిఖీల్లో ఆటోక్లేవ్ మెషిన్, లామినార్ ఎయిర్ ఫ్లో యూనిట్, సుమారు 60 ఖాళీ రక్త బ్యాగులు, 110 నిండిన రక్త బ్యాగులు స్వాధీనం చేసుకున్నారు. లామినార్ ఎయిర్ ఫ్లో యూనిట్ ఉండటం వల్ల అక్కడ రక్తాన్ని స్టెరైల్ వాతావరణంలో ప్రాసెస్ చేస్తున్నట్టు స్పష్టమవుతోందని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇది సాధారణ నిల్వ కోసం ఉపయోగించే పరికరం కాదని, రక్త ప్రాసెసింగ్ జరుగుతుందనే అనుమానాలను బలపరుస్తోందని చెప్పారు. ఈ ఘటన అత్యంత ప్రాణాంతకమని అధికారులు హెచ్చరిస్తున్నారు. జంతు రక్తం పొరపాటున కూడా మానవ వైద్య సరఫరా వ్యవస్థలోకి చేరితే తీవ్రమైన ప్రాణ నష్టం సంభవించే ప్రమాదం ఉందని తెలిపారు. "మానవ రక్తంలోనే గ్రూప్ సరిపోలకపోతే మరణం సంభవిస్తుంది. జంతు రక్తాన్ని మనిషికి ఇస్తే అది తప్పనిసరిగా ప్రాణాంతకం. అందుకే రక్తాన్ని ఔషధంగా పరిగణించి కఠిన నియంత్రణలు విధిస్తారు," అని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సీ.ఎన్.కే ఇంపోర్ట్‌ఎగుమతి కంపెనీ యజమాని నికేష్ గత రెండు రోజులుగా పరారీలో ఉన్నాడు. ప్రతి రక్త బ్యాగుకు రూ. 2,000 నుంచి రూ.3,000 వరకు బుచర్లకు చెల్లించి జంతు రక్తాన్ని సేకరించినట్టు అధికారులు గుర్తించారు. విచారణకు వస్తానని చెప్పి, ఆపై ఫోన్ ఆఫ్ చేసి పరారైనట్టు పోలీసులు తెలిపారు. దర్యాప్తు కీసర ప్రాంతంలోని ఒక బుచర్ షాపు వద్ద మొదలైంది. అక్కడ సుమారు 150 రక్త బ్యాగులు స్వాధీనం చేసుకున్నారు. బుచర్లు తాము కేవలం రక్తాన్ని నికేష్‌కు ఇచ్చామని, తుది వినియోగం గురించి తమకు తెలియదని విచారణలో వెల్లడించారు. కీసర పరిసరాల్లోని ఒంటరి ప్రాంతాల నుంచి కూడా జంతు రక్తాన్ని సేకరించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై కీసర పోలీస్ స్టేషన్‌లో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ సెక్షన్ 18(సి) కింద కేసు నమోదు చేశారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా రక్త బ్యాగులు, ఆటోక్లేవ్ మెషిన్ వంటి నియంత్రిత వైద్య పరికరాలు కలిగి ఉండటం స్పష్టమైన చట్ట ఉల్లంఘనగా అధికారులు పేర్కొన్నారు. ప్రాంగణాన్ని సీల్ చేసి, రక్త నమూనాలను ల్యాబ్ పరీక్షలకు పంపించారు. కంపెనీ రికార్డులు, రవాణా పత్రాలు, ఆర్థిక లావాదేవీలపై విస్తృత దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తు పూర్తయ్యాక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, ఉల్లంఘనలు నిర్ధారితమైతే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు అని అధికారులు స్పష్టం చేశారు.



# నకిలీ ప్రొఫైల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

**సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు : సైబరాబాద్ పోలీసులు హెచ్చరిక**

**హైదరాబాద్ (జై భీమ్ న్యూస్):**


సోషల్ మీడియా వేదికలను అడ్డుపెట్టుకొని నకిలీ ఖాతాల ద్వారా ప్రజలను మోసం చేస్తున్న ఘటనలు రోజురోజుకీ పెరుగుతున్నాయని సైబరాబాద్ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు, సంస్థల పేర్లు మరియు ఫోటోలు వాడుతూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. డిజిటల్ మాధ్యమాల్లో లభ్యమయ్యే వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకుని అత్యవసరంగా డబ్బు కావాలంటూ అడగడం, తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తామని నమ్మించడం, ఉద్యోగాలు లేదా పెట్టుబడుల పేరుతో మోసం చేయడం వంటి ఘటనలు ఎక్కువవుతున్నాయని తెలిపారు. ఒక్కసారి అనుమానాస్పద లింక్‌పై క్లిక్ చేస్తే ఖాతాలు హ్యాక్ కావడంతో పాటు ఆర్థిక నష్టం కలిగే ప్రమాదం ఉందని సూచించారు.

**సైబరాబాద్ పోలీసుల సూచనలు**

సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించే ముందు ప్రొఫైల్ నిజమైనదో కాదో తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. స్నేహితులు లేదా బంధువుల పేరుతో డబ్బు అడిగితే నేరుగా ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని తెలిపారు. బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు ఎప్పటికీ ఞూలు, పిన్ నంబర్లు లేదా బ్యాంక్ వివరాలను ఫోన్ ద్వారా అడగవని స్పష్టం చేశారు. అపరిచిత ఖాతాల నుంచి వచ్చే ఆఫర్లు, తక్కువ ధరలకు వస్తువులు లేదా వాహనాలు అమ్ముతామని చెప్పే ప్రకటనలు, ముందుగా అడ్వాన్స్ లేదా ప్రాసెసింగ్ ఫీజులు కోరితే వెంటనే తిరస్కరించాలని సూచించారు. OTP\T, UPI వివరాలు, ఆధార్, పాన్ వంటి కీలక సమాచారాన్ని ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు. ప్రతి సోషల్ మీడియా ఖాతాకు బలమైన పాస్‌వర్డ్ ఉపయోగించడం, వేర్వేరు పాస్‌వర్డ్‌లు పెట్టుకోవడం, టూ-స్టెప్ వెరిఫికేషన్, ప్రైవసీ సెట్టింగ్స్ అమలు చేయడం ద్వారా భద్రత పెంచుకోవచ్చని తెలిపారు. అనుమానాస్పద లేదా నకిలీ ఖాతాలను వెంటనే బ్లాక్ చేసి సంబంధిత సోషల్ మీడియా వేదికలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

**ఫిర్యాదు ఎలా చేయాలి**

సైబర్ మోసాలకు గురైన వారు లేదా నకిలీ ఖాతాలను గుర్తించిన వారు ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సైబరాబాద్ పోలీసులు కోరారు. సమీప పోలీస్ స్టేషన్‌ను కూడా సంప్రదించవచ్చని తెలిపారు. సైబర్ నేరాల్లో తొలి గంట (గోల్డెన్ అవర్)లో ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టాన్ని తగ్గించే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వరంగల్‌లో బైక్ ర్యాలీ

**వరంగల్, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని వరంగల్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో శుక్రవారం ఉదయం 10.15 గంటలకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ర్యాలీలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఇతర పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి పాల్గొననున్నారు. ర్యాలీ వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం నుంచి ప్రారంభమై హనుమకొండ చౌరస్తా, ములుగు రోడ్, ఎం.జి.ఎం మార్గంగా సాగి, పోచమ్మ మైదాన్‌లోని ఎస్.ఆర్ ఉమెన్స్ కళాశాల ఆవరణలో ముగుస్తుంది. ఈ బైక్ ర్యాలీ ద్వారా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ వినియోగం, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో చైతన్యం కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వరంగల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని పోలీస్ అధికారులు పిలుపునిచ్చారు.

## యాసంగికి యూరియా కొరత లేదు: జిల్లా కలెక్టర్ డా. సత్య శారద




**వరంగల్, జనవరి 8, 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద యూరియా సరఫరా, పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆర్డీవోలు, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు నిరంతరాయంగా యూరియా సరఫరా కొనసాగుతుందని, యాసంగి 202526 పంటల సాగుకు అవసరమైన యూరియాను ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా పని చేసి ప్రతి రైతుకు సాగుకు సరిపడా యూరియా అందేలా చూడాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో 20,230 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. యాసంగి పంటకాలానికి మొత్తం 19,770 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, అందులో 9,770 మెట్రిక్ టన్నులు జనవరి నెలలోనే రైతులకు అవసరానికి అనుగుణంగా సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సహకార అధికారి నీరజ, డీఎం మార్క్‌ఫెడ్ తదితరులు పాల్గొన్నారు.

## మామునూర్ ఎయిర్‌పోర్ట్ భూ సేకరణ పూర్తి

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారదకు ఘన సత్కారం**



**వరంగల్, జనవరి 8, 2026 (జై భీమ్ న్యూస్)**

మామునూర్ ఎయిర్‌పోర్ట్ భూ సేకరణను సకాలంలో, విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ శాఖ అధికారులు ఘనంగా సత్కారం నిర్వహించారు. ఇటీవల హనుమకొండలో జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ తరపున రాష్ట్ర ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మామునూర్ ఎయిర్‌పోర్ట్ భూ సేకరణను సమయానికి పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్‌ను అభినందించిన నేపథ్యంతో ఈ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్, నర్సంపేట ఆర్‌డీఓలు సుమ, ఉమారాణిలతో పాటు జిల్లాలోని తహసీల్దారులు, రెవెన్యూ శాఖ అధికారులు కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి, శాలువాతో సన్మానించారు. అధికారులు మాట్లాడుతూ, మామునూర్ ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ జిల్లా అభివృద్ధికి, ఉపాధి అవకాశాల కల్పనకు కీలకంగా నిలవనుందని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ, ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం భూ సేకరణ ప్రక్రియను సమయానికి పూర్తి చేయడంలో రెవె న్యూ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. భూ సేకరణలో సహకరించిన రైతులు, రెవెన్యూ అధికారులు, ఇతర శాఖల సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వరంగల్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ - రిజిస్ట్రేషన్ మేళా

**వరంగల్, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల కోసం ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళాను ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వెల్లడించింది. ఈ మేళా పాత డీటీఓ కార్యాలయం, సుబేదారి, హనుమకొండలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆహార పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కొత్త ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు పొందడంతో పాటు ఇప్పటికే ఉన్న లైసెన్సులను రిన్యూవల్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఇతర వివరాల కోసం ఆహార భద్రతా అధికారిని 7330643793 నంబర్‌లో, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌ను 9985820544 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

# ప్రేమించిన యువకుడు అనుమానించాడని..

**వాటర్ ట్యాంక్‌పై నుంచి దూకి యువతి ఆత్మహత్య**
**నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన**

**హైద్రాబాద్, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**



నాగోలు సమీపంలోని తట్టిఅన్నారం వైఎస్ఆర్ కాలనీలో అద్దెకు ఉంటున్న ఖమ్మం జిల్లా కొత్తగూడెం పట్టణానికి చెందిన ఐశ్వర్య (19) అనుమానాల వేధింపుల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఐశ్వర్య తన అన్న అరవింద్‌తో కలిసి నివసిస్తోంది. వీరికి దూరపు బంధువైన మహేష్ అలియాస్ ఆనంద్ (23) నగరంలోని హస్తినాపురంలో ఉంటూ ఆటో నడుపుతుండేవాడు. ఏడాది క్రితం జరిగిన అయ్యప్ప పూజ సందర్భంగా ఐశ్వర్యను చూసిన ఆనంద్, బంధుత్వంతో తరచూ వారి ఇంటికి వచ్చేవాడని తెలుస్తోంది. ఇటీవల ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో యువతి అంగీకరించినట్టు సమాచారం. మొదట పెద్దలు నిరాకరించినా, అనంతరం వారి సమ్మతితో సంబంధం కొనసాగింది. అయితే ఐశ్వర్య మరెవరితోనో ఫోన్‌లో తరచూ మాట్లాడుతోందని అనుమానంతో ఆనంద్ ఆమెపై ఒత్తిడి పెంచినట్టు తెలిసింది. ఈ నెల 5వ తేదీన, ఇరువురు తరచూ కలుసుకునే హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ వద్దకు వెళ్లారు. ఫోన్ కాల్స్ విషయమై ఆనంద్ ప్రశ్నించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఐశ్వర్య ట్యాంక్‌పై నుంచి దూకింది. ఆమెను నాగోలులోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఐశ్వర్య తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మహేష్ అలియాస్ ఆనంద్పై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# యువత క్రీడా ప్రతిభకు సీఎం కప్ సువర్ణ అవకాశం

**సీఎం కప్ టార్చ్ ర్యాలీకి జెండా ఊపిన జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**




**ములుగు, జనవరి 8, 2026(జై భీమ్ న్యూస్)**

యువత తమ క్రీడా ప్రతిభను వెలికితీయడానికి సీఎం కప్ పోటీలు ఒక సువర్ణ అవకాశమని దివాకర టి.ఎస్. పేర్కొన్నారు. ఈ పోటీలను గ్రామీణ ప్రాంతాల యువత, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ములుగు జిల్లా కలెక్టరేట్‌లో సీఎం కప్ రెండవ ఎడిషన్‌కు సంబంధించిన టార్చ్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయి క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడమే సీఎం కప్ లక్ష్యమని తెలిపారు. ఈ పోటీలు భవిష్యత్ క్రీడాకారులకు సరైన వేదికగా నిలుస్తాయని అన్నారు. సీఎం కప్ పోటీలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు టార్చ్ ర్యాలీ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. వివిధ మండలాలు, పాఠశాలలు, కార్యాలయాల్లో ఈ ర్యాలీ నిర్వహించి యువతను క్రీడల వైపు ప్రోత్సహించనున్నట్లు పేర్కొన్నారు. శాట్స్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామ స్థాయిలో జనవరి 17 నుంచి 22 వరకు, మండల స్థాయిలో 28 నుంచి 31 వరకు, నియోజకవర్గ స్థాయిలో ఫిబ్రవరి 3 నుంచి 7 వరకు, జిల్లా స్థాయిలో 10 నుంచి 14 వరకు, రాష్ట్ర స్థాయిలో ఫిబ్రవరి 19 నుంచి 26 వరకు పోటీలు జరగనున్నాయి. ములుగు జిల్లా క్రీడాకారులు అత్యధిక పతకాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాధికారి మలోత్ సర్దార్ సింగ్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పగడాల వెంకటేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని జిల్లా ఈవీఎం గోదాములను జిల్లా కలెక్టర్ సత్య శారదా గురువారం తనిఖీ చేశారు. ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా ఆదేశాల మేరకు ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా, ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాములకు సంబంధించిన రికార్డులు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిరంతర పర్యవేక్షణ వ్యవస్థ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలవుతున్నాయా అనే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్ శ్రీకాంత్, నాయబ్ తహసీల్దార్ రంజిత్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడేందుకు ఈవీఎం గోదాముల తనిఖీలు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు.

# "ప్లాస్టిక్ పతంగులు వద్దు పేపర్ పతంగులు ముద్దు"






**సుజాత విద్యా నికేతన్‌లో పేపర్ కైట్స్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహణ**

**హాసన్ పర్తి, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

66వ డివిజన్ కేంద్రంలోని సుజాత విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల, హసన్పర్తిలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారాం కర్ణ ఆధ్వర్యంలో "పేపర్ కైట్స్ ఫెస్టివల్"ను ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం కాగితపు గాలిపటాలనే ఎగురవేయాలని, చైనా మాంజా దారాలను పూర్తిగా వాడకూడదని సూచించారు. నూలు దారాలతో పేపర్ గాలిపటాలు ఎగురవేస్తూ ఈ సంక్రాంతి పండుగను ఆనందోత్సాహాలతో, భద్రతతో జరుపుకోవాలని కోరారు. ప్లాస్టిక్ గాలిపటాలు, చైనా మాంజా దారాలు పక్షులు, జంతువులు మాత్రమే కాదు, మనుషుల ప్రాణాలకు కూడా ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రభుత్వం చైనా మాంజాను నిషేధించిన విషయాన్ని గుర్తుచేశారు. పాఠశాల పర్యావరణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో చైనా మాంజా నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, హసన్పర్తి పట్టణంలోని కూడళ్లలో పోస్టర్లు అంటించి ప్రజలకు అవగాహన కల్పించారు. చైనా మాంజాను అమ్మినా లేదా కొన్నా రూ. 5000 జరిమానా లేదా ఒక సంవత్సరం జైలు శిక్ష విధించబడుతుందని ప్రజలకు తెలియజేశారు. దేశ పౌరులుగా మనకున్న ముఖ్యమైన బాధ్యతలలో పర్యావరణ పరిరక్షణ అగ్రస్థానంలో ఉందని, దానికి ప్రధాన పరిష్కారం చెట్లు నాటడమేనని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ దిశగా పాఠశాల గత 30 సంవత్సరాలుగా నిరంతరం కృషి చేస్తూ, జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అనేక పర్యావరణ మిత్ర అవార్డులు సాధించిందని తెలిపారు. విద్యార్థులు కూడా పర్యావరణ సంరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పేపర్ గాలిపటాలు ఎగురవేసి పేపర్ కైట్స్ ఫెస్టివల్‌ను ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, ఈ. వెంకట్, పి. వెంకటేశ్వర్లు, ఈ. ప్రవీణ్, రాధాకుమారి, సబిహాబేగం, సుధారాణి, వై. అరుణ, సిహెచ్. సుచిత్ర, సిహెచ్. సంధ్య, జి. సంధ్య, సరిత, గీత, ప్రవళిక, మౌనిక, స్వాతి, లావణ్య, దేవిక తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల సమన్వయంతో సమ్మక్క సారలమ్మ మహా జాతరను విజయవంతం చేయాలి

**జోనల్, సెక్టార్ అధికారులకు ప్రత్యేక శిక్షణ**

**అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీ**






**ములుగు, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతరను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీ అన్నారు. మేడారం జాతర నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యల్లో భాగంగా, జాతరలో విధులు నిర్వహించనున్న జోనల్, సెక్టార్ అధికారులకు గురువారం మేడారంలోని హరిత హోటల్‌లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జీతో పాటు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ జీ మాట్లాడుతూ, జాతర ప్రాంతాన్ని సమగ్రంగా 12 జోన్లుగా విభజించి, వాటికి సంబంధించిన 62 మంది జోనల్ అధికారులు, అలాగే 51 సెక్టార్లకు చెందిన 179 మంది సెక్టార్ అధికారులను నియమించినట్లు తెలిపారు. జాతర సమయంలో చేపట్టాల్సిన బాధ్యతలు, నిర్వహణ విధానం, భక్తుల భద్రత, రవాణా నియంత్రణ, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన అవగాహన కల్పించామని చెప్పారు. శిక్షణలో భాగంగా ప్రతి అధికారికి స్పష్టమైన మార్గదర్శకాలతో కూడిన జాబ్ మాన్యువల్ అందజేశామని తెలిపారు. జాతర సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులకు సూచించారు. అలాగే, జాతర నిర్వహణలో ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నట్లు పేర్కొంటూ, డ్రోన్ సర్వైలెన్స్ ద్వారా జనసందోహాన్ని పర్యవేక్షించడంతో పాటు, మాస్టర్ కంట్రోల్ రూమ్ ద్వారా క్షేత్రస్థాయిలోని అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని తెలిపారు. దీంతో సమస్యలు తలెత్తిన వెంటనే గుర్తించి తక్షణ పరిష్కారం సాధ్యమవుతుందని అన్నారు. ప్రత్యేకంగా జంపన్న వాగు ప్రాంతంలో జనసందోహం ఎక్కువగా ఉండే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మూడు షిఫ్టుల్లో గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ జాతరను విజయవంతం చేయాలని, ప్రతి అధికారి తనకు కేటాయించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శాఖపరమైన సమస్యలపై పరిపాలన విభాగం తక్షణమే స్పందించాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**





**వరంగల్, జనవరి 8, 2026 (జై భీమ్ న్యూస్)**

పోలీస్ అధికారులు, సిబ్బందికి సంబంధించిన శాఖపరమైన సమస్యలపై పరిపాలన విభాగం వెంటనే స్పందించాలని సన్ ప్రీత్ సింగ్, వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ పరిపాలన విభాగం కార్యాలయాన్ని తనిఖీ చేశారు. సిపిఓ కార్యాలయానికి చేరుకున్న కమిషనర్‌కు అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసులచే గౌరవ వందనం సమర్పించబడింది. అనంతరం పరిపాలన విభాగం కార్యాలయంలోని బడ్జెట్, ఎస్టాబ్లిష్‌మెంట్, పే, జనరల్ సెక్షన్లతో పాటు ఎంఎస్ సెక్షన్లు, ఇన్‌వర్డ్, అవుట్‌వర్డ్ విభాగాలను కమిషనర్ సందర్శించారు. ఆయా సెక్షన్ల అధికారులు నిర్వహిస్తున్న విధులు, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది విధులకు సంబంధించిన పలు రికార్డులను ఆయన సవివరంగా పరిశీలించారు. ముఖ్యంగా సిబ్బందికి సంబంధించిన శాఖపరమైన సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై సంబంధిత సెక్షన్ అధికారులు తీసుకుంటున్న చర్యల వివరాలకు సంబంధించిన రికార్డులను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిపాలన విభాగం సజావుగా కొనసాగేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, అధికారుల మధ్య ఎలాంటి ఆలస్యం లేకుండా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, పరిపాలన పరంగా ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో అదనపు డీసీపీ రవి, పరిపాలన విభాగం ఏఓ సంపత్, సెక్షన్ సూపరింటెండెంట్లు రమేష్, యాకూబ్ బాబా, సంధ్య, జలజ, రమాదేవి, సురేందర్‌తో పాటు ఇతర పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాల పేరుతో యూనివర్సిటీ భూముల కబ్జా సరికాదు

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వ్యాఖ్యలపై కేయూ బి.ఆర్.ఎస్.వి నేతల మండిపాటు**

**హన్మకొండ, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బి.ఆర్.ఎస్.వి నాయకులు కేయూ గెస్ట్ హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీ భూముల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు అంశంలో అనాలోచిత నిర్ణయాలు తీసుకుని, విద్యార్థి సంఘంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ రాష్ట్ర నాయకులు కత్తెరపల్లి దామోదర్, డా. కొమురయ్య, బి.ఆర్.ఎస్.వి ఇంచార్జి జెట్టి రాజేందర్ మాట్లాడుతూతెలంగాణ అసెంబ్లీలో ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి విభాగం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. యూనివర్సిటీ భూముల్లో పాఠశాల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నది ఒక్క బి.ఆర్.ఎస్.వి మాత్రమేనని, మిగతా అన్ని విద్యార్థి సంఘాలు మద్దతిస్తున్నాయంటూ అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధమని వారు అన్నారు. విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సంఘం ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. బి.ఆర్.ఎస్.వి విద్యా సంస్థలకు వ్యతిరేకం కాదని, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాన్ని స్వాగతిస్తామని స్పష్టం చేశారు. అయితే దాని పేరుతో యూనివర్సిటీ భూములను త్యాగం చేయడం మాత్రం అంగీకరించబోమని తెలిపారు.




భవిష్యత్తు తరాల విద్యార్థుల అవసరాల కోసం యూనివర్సిటీ భూములను కాపాడటం తమ బాధ్యత అని పేర్కొన్నారు. హనుమకొండ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు లేవని చెప్పడం వాస్తవానికి విరుద్ధమని బి.ఆర్.ఎస్.వి నేతలు స్పష్టం చేశారు. అక్కడ అనేక ప్రభుత్వ భూములు ఉన్నప్పటికీ, వాటిని పక్కనపెట్టి యూనివర్సిటీ భూమినే లక్ష్యంగా చేసుకోవడం వెనుక కబ్జా కుట్ర దురుద్దేశం కనిపిస్తోందని విమర్శించారు. యూనివర్సిటీ ముందున్న టీబీ ఆస్పత్రి స్థలం సహా ఇతర ప్రత్యామ్నాయ భూములు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. గతంలో కాకతీయ యూనివర్సిటీ భూములపై జరిగిన అక్రమాలపై బి.ఆర్.ఎస్.వి పోరాటం చేయడంతో సర్వే నిర్వహించినప్పటికీ, ఆ సర్వే నివేదికను ఇప్పటివరకు ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ పాఠశాల నిర్మాణం పేరుతో యూనివర్సిటీ భూములను కబ్జా చేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాకతీయ యూనివర్సిటీ ఒక స్వతంత్ర, స్వాయత్త విద్యా సంస్థ అని, రాష్ట్ర ప్రభుత్వం గానీ స్థానిక ఎమ్మెల్యే గానీ యూనివర్సిటీపై పెత్తనం చెలాయించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. యూనివర్సిటీ భూమిని పాఠశాలకు కేటాయించేందుకు చట్టబద్ధమైన ఆధారాలుంటే ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూముల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, భూములపై నిర్వహించిన సర్వే రిపోర్టును తక్షణమే బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అక్రమాల్లో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకునే వరకు బి.ఆర్.ఎస్.వి పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు రాకేష్ యాదవ్, పిల్లల నాగరాజు, ముస్కె రాము, గొల్లపల్లి వీరు, పస్తం అనిల్, కోరపెల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెస్ సమస్యలు పరిష్కరించాలి


**కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ముట్టడి**

**హన్మకొండ, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో హాస్టల్ మెస్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీ విద్యార్థులు పరిపాలన భవనాన్ని ముట్టడించి ఆందోళనకు దిగారు. నాణ్యమైన ఆహారం అందడం లేదని, అన్నంలో పురుగులు, మేకులు, సీసా పెంకులు వస్తున్నాయని, ఈ విషయమై ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారుల నుంచి స్పందన లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్లలో కనీస సదుపాయాలు లేవని, మెస్‌లలో కుక్కలు తిరుగుతున్నాయని ఆరోపిస్తూ విద్యార్థులు "పురుగుల అన్నం మాకు పెరుగన్నం మీకు" అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సహకారం అందించింది. విషయం తెలుసుకున్న అధికారులు ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఎగ్జామినేషన్ కంట్రోలర్ కట్ల రాజేందర్, స్టూడెంట్ అఫైర్స్ డీల్ ఇస్తారి, మహిళల మెస్‌కు సంబంధించిన అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థుల సమస్యలు వింటామని తెలిపారు. అయితే విద్యార్థినులు స్పందిస్తూ, "ఇన్ని రోజులు ఎక్కడ ఉన్నారు? మీరు ఎవరో కూడా మాకు తెలియదు" అంటూ అధికారులను ప్రశ్నించారు. అధికారుల సమాధానంతో అసంతృప్తి వ్యక్తం చేసిన విద్యార్థులు వైస్‌చాన్స్‌లర్ (వీసీ) స్వయంగా కిందికి వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీసీ కిందికి రాకముందే విద్యార్థులు



వీసీ ఛాంబర్‌కు వెళ్లి సమస్యలపై ప్రశ్నించారు. దీనికి వీసీ సానుకూలంగా స్పందిస్తూ, విద్యార్థుల నుంచి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, హాస్టల్, మెస్‌కు సంబంధించిన అధికారులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. వారం రోజులలోపు మెస్, హాస్టల్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని వీసీ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కాకతీయ విశ్వవిద్యాలయం అధ్యక్షులు ఉబ్బటి హరికృష్ణ అఖిల్‌తో పాటు మాధవరెడ్డి, మెరుగు సాయికుమార్, విజయ్, క్రాంతి, రాజు తదితరులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు!

**ప్రొఫెసర్ ఆనంద్ కిషోర్, నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ వరంగల్**

**హన్మకొండ, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), హనుమకొండలో "డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ ఇన్ అకాడమిక్ లైబ్రరీస్ నావిగేటింగ్ ఛాలెంజెస్ & లెవెరేజింగ్ అపర్చునిటీస్" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సును పి.ఎం. ఉష (ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ పీఎం – ఉషా), హైదరాబాద్ సహకారంతో, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ అఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టి.జి.ఎస్.సి.హెచ్.ఈ) ఆధ్వర్యంలో కళాశాల లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం నిర్వహిస్తోంది. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆనంద్ కిషోర్, మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని పేర్కొన్నారు. గ్రంథపాలకులు డిజిటలైజేషన్‌ను సమర్థంగా వినియోగించి అశేష పాఠక లోకాన్ని ఆకట్టుకోవాలన్నారు. కీలకోపన్యాసం చేసిన ఉస్మానియా యూనివర్సిటీ లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ఎన్. లక్ష్మణ రావు, ఆధునిక డిజిటలైజేషన్‌తో నవ్య గ్రంథాలయాలను పాఠకులకు మరింత చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు.




అలాగే విశ్రాంత ప్రొఫెసర్ సుదర్శన్ రావు, యూనివర్సిటీ అఫ్ ఢిల్లీ ప్రొఫెసర్ ఎం. మధుసూదన్ మాట్లాడుతూ డిజిటలైజేషన్‌తో గ్రంథాలయాలు పునరుజ్జీవనం పొందుతున్నాయని పేర్కొన్నారు. నిట్ వరంగల్ ప్రొఫెసర్ వై. శ్రీనివాసరావు ఈబుక్స్, ఈజర్నల్స్ ద్వారా గ్రంథాలయాలు విస్తృత సేవలు అందిస్తున్నాయని తెలిపారు. సదస్సులో విశ్రాంత గ్రంథపాలకులు రమణయ్య, సత్యనారాయణ ప్రసంగించారు. సెమినార్ కన్వీనర్ డా. బి. యుగంధర్ జాతీయ సదస్సు ఉద్దేశ్యాలు, లక్ష్యాలు వివరించగా, వందకు పైగా పరిశోధనా పత్రాలు రావడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా 75 పరిశోధక పత్రాలతో కూడిన సావనీర్, 41 పూర్తి పరిశోధక పత్రాలతో కూడిన జర్నల్ను ముఖ్య అతిథులు, ప్రిన్సిపాల్, కన్వీనర్, నిర్వాహకులు సంయుక్తంగా ఆవిష్కరించారు. అనంతరం అతిథులను శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. టెక్నికల్ సెషన్లలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన అధ్యాపకులు, పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. డి. సురేష్ బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణ, అధ్యాపకులు, విభాగాధిపతులు, బోధనబోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి గణిత ప్రతిభ శిక్షణ శిబిరానికి ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు



**హన్మకొండ, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు కే. భార్గవ్, డి. హరీశ్ ప్రతిష్ఠాత్మకమైన జాతీయ స్థాయి గణిత టాలెంట్ శిక్షణ శిబిరం (ఎంటిటిఎస్) కార్యక్రమానికి ఎంపికై హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 40 మంది విద్యార్థుల్లో వీరిద్దరూ చోటు దక్కించుకోవడం కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. ఈ శిక్షణా కార్యక్రమం డిసెంబర్ 29 నుండి జనవరి 3 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ తిరుపతిలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ హైదరాబాద్ ప్రొఫెసర్ డా. సుకుమార్ మరియు సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ చంద్రశేఖర్ మార్గదర్శకత్వంలో రియల్ ఎనాలిసిస్, లీనియర్ ఆల్జీబ్రా, మాథమాటికల్ అప్లికేషన్స్ అంశాలపై లోతైన శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగాధిపతి తండు నాగయ్య, అధ్యాపకులు డాక్టర్ మంజుల, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, అలాగే కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు.

# పురుషుల కుటుంబ నియంత్రణకు ముందడుగు

**ఉర్సు ఆసుపత్రిలో విజయవంతంగా వేసెక్టమీ క్యాంపు**



**వరంగల్, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరంగల్ ఆదేశాల మేరకు గురువారం సీకేఎం ఆసుపత్రి అనుబంధ ఉర్సు ఆసుపత్రిలో పురుషుల కుటుంబ నియంత్రణ (వేసెక్టమీ) శస్త్ర చికిత్సల క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో పురుషుల కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స కోసం మొత్తం 24 మంది ముందుగా పేరు నమోదు చేసుకున్నారు. డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ కార్తీక్ సర్జన్ల ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించబడినట్లు అధికారులు తెలిపారు. క్యాంపును ప్రారంభించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ పురుషులకు చేసే వేసెక్టమీ ఆపరేషన్ అత్యంత సాధారణమైనదని, ఎలాంటి కోతలు లేదా కుట్లు అవసరం లేకుండా కేవలం రెండు నిమిషాల్లో నిర్వహించే శస్త్ర చికిత్స అని వివరించారు. ఈ ఆపరేషన్ చేయించుకోవడం వల్ల పురుషులలో ఎలాంటి వైకల్యం కలగదని, వారు సాధారణ జీవితాన్ని కొనసాగించవచ్చని స్పష్టం చేశారు. కుటుంబ బాధ్యతలను పురుషునిగా సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. గతంలో అనేక మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వేసెక్టమీ శస్త్ర చికిత్స చేయించుకుని ఎలాంటి సమస్యలు లేకుండా సాధారణ జీవితం గడుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. కుటుంబ నియంత్రణలో పురుషుల పాత్ర ఎంతో ముఖ్యమని, మరింత మంది పురుషులు ముందుకు వచ్చి వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాతాశిశు సంరక్షణ కార్యక్రమం అధికారి డాక్టర్ విజయకుమార్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ప్రతీక్, డిప్యూటీ డెమోతో పాటు సంబంధిత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సీఎం కప్ టార్చ్ ర్యాలీ

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**




2025 సీఎం కప్పు సన్నాహక టార్చ్ ర్యాలీ మండలంలో పున్నెలు గ్రామం నుండి అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి గుగులోతు అశోక్ కుమార్,తహసీల్దార్ విక్రమ్,ఎంపీడీవో నర్మదా,ఎంఈఓ పులి ఆనందం,స్థానిక ఎస్సై శ్రీనివాస్,2025 సీఎం కప్పు మండల ఇన్చార్జి సీనియర్ కోచ్ విష్ణు,జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాల ఐనవోలు ప్రధాన ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పున్నెలు ప్రధానోపాధ్యాయులు వసంత్ కుమార్,సీనియర్ వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు వరంగల్ జిల్లా యోగ అసోసియేషన్ అధ్యక్షులు బొలిశెట్టి కమలాకర్ పున్నెలు సర్పంచ్ ఉస్మాన్ అలీ,ఐనవోలు సర్పంచ్ రఘువంశీ గౌడ్,వెంకటపూర్ సర్పంచ్,వనమాల కనపర్తి సర్పంచ్,పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు హరి, గుగులోతు కిషన్,కిరణ్, కైలాస్,సుమలత,ఎస్సార్ పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు అలాగే ఏకశిలా వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు సెయింట్ ఆన్స్ పాఠశాల వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

## రూ.15,000 లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన కేయూ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీకాంత్



**హన్మకొండ, 8 జనవరి 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

పోలీస్ శాఖ ప్రతిష్ఠకు మచ్చ తెచ్చే ఘటన హనుమకొండ జిల్లాలో చోటుచేసుకుంది. పేకాట కేసులో నిందితుడిని వదిలివేయాలంటూ రూ.15,000 లంచం డిమాండ్ చేసి, స్వీకరిస్తున్న సమయంలో కేయూ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ శ్రీకాంత్ ఏసీబీ అధికారుల వలలో చిక్కారు. వివరాల ప్రకారం, కేయూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదు అయిన పేకాట కేసులో నిందితుడిని అరెస్టు చేయకుండా, కేసును తేలికపరచడంతో పాటు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎస్ఐ శ్రీకాంత్ లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. లంచం ఇవ్వడానికి నిరాకరించిన బాధితుడు ఈ విషయాన్ని తెలంగాణ ఆంటీ -కరప్షన్ బ్యూరో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించి ట్రాప్ ఆపరేషన్ చేపట్టారు. నిర్దేశించిన ప్రదేశంలో నిందితుడి నుంచి లంచం మొత్తం తీసుకుంటున్న సమయంలో ఎస్ఐ శ్రీకాంత్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ట్రాప్ సందర్భంగా ఎస్ఐ వద్ద నుంచి లంచం నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన అనంతరం ఎస్ఐ శ్రీకాంత్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, తదుపరి విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. లంచం తీసుకోవడంలో ఇతరుల పాత్ర ఉందా? ఇలాంటి ఘటనలు గతంలో కూడా చోటుచేసుకున్నాయా? అనే కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర కలకలం రేపింది. ప్రజల రక్షణ కోసం పని చేయాల్సిన పోలీసు అధికారి అవినీతికి పాల్పడటం దురదృష్టకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా పోలీస్ శాఖలో అవినీతిపై ఎలాంటి సహనం ఉండదని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో ప్రజలు భయపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ మరోసారి ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

## మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే నాగరాజు పరామర్శ



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు మండల కేంద్రానికి చెందిన వరంగల్ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ తల్లి నకరకంటి రాంబాయి అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన గ్రామ సర్పంచ్ శంకర్



**వికారాబాద్ జిల్లా జై భీమ్ న్యూస్:**

వికారాబాద్ జిల్లా దోమ మండలం కేసీలమ్మ తండా, బాధ్య నాయక్ తండా ను గ్రామ సర్పంచ్ శంకర్ ఆకస్మికంగా సందర్శించాడు. విద్యార్థుల రీడింగ్, రైటింగ్, నైపుణ్యాలు పాఠ్య పుస్తకాలు వర్క్ బుక్కులు, నోట్ బుక్ లను పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న మిడ్ డే మిల్ కార్యక్రమాన్ని గురించి కూడా సిబ్బందితో చర్చించారు. మిడ్ డే మిల్ కార్యక్రమాన్ని మరింత బలోపేతం చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ నాయక్, ఉపాధ్యాయుల బృందం, అంగన్వాడి సూపర్వైజర్, అంగన్వాడి టీచర్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

# అర్చక, ఉద్యోగులందరికీ సమాన వేతనం పెన్షన్ సౌకర్యం కల్పించాలి: జేఏసీ డిమాండ్






**కొమురవెల్లి, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల మనుగడకు, ఆధ్యాత్మిక వైభవానికి మూలస్తంభాలైన అర్చకులు, దేవాలయ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మానవీయ దృక్పథంతో స్పందించాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ డిమాండ్ చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, కన్వీనర్ డి.వి.ఆర్. శర్మలు పాల్గొని దేవాదాయ శాఖలో నెలకొన్న వేతన వ్యత్యాసాలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఆదాయం ఆర్జిస్తున్న 686 దేవాలయాల్లో వేలాది మంది అర్చకులు, సిబ్బంది దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందిస్తున్నప్పటికీ, నేటికీ అత్యధికులు రూ.1,500 నుంచి రూ.6,000 మధ్య అతి స్వల్ప వేతనాలతో నిరుపేద జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేతనాలు ఏమాత్రం సరిపోవని, ఇది వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనని అన్నారు. ప్రభుత్వానికి జేఏసీ తరపున పలు కీలక డిమాండ్లు వినిపించారు. జీవో 577 ప్రకారం అర్హత ఉన్న 5,625 మంది అర్చక ఉద్యోగులకు తక్షణమే గ్రాంట్-ఇన్-ఎయిడ్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ప్రస్తుతం కేవలం 2,622 మందికే ఈ ప్రయోజనం అందుతోందని తెలిపారు. సాంకేతిక కారణాలను చూపుతూ మిగిలిన 3,000 మందికిపైగా అర్హులైన సిబ్బందిని విస్మరించడం అన్యాయమని పేర్కొంటూ, వారందరికీ వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే దేవాలయాల్లో కనీసం మూడు సంవత్సరాల సేవ పూర్తి చేసిన కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మానవీయ దృక్పథంతో రెగ్యులరైజ్ చేయాలని, ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగుల మాదిరిగానే భద్రత కల్పించాలని కోరారు. దేవాదాయ శాఖలో అధికారులకు ట్రెజరీ ద్వారా జీతాలు, పెన్షన్లు అందుతుండగా, ఆలయ నిర్వహణలో కీలక పాత్ర పోషించే అర్చకులకు ఈ సౌకర్యాలు లేకపోవడం తీవ్ర అన్యాయమని పేర్కొన్నారు. అందుకుగాను దేవాదాయ శాఖ చట్టంలో అవసరమైన సవరణలు చేసి, అర్చక ఉద్యోగులందరికీ ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించే విధానాన్ని అమలు చేయాలని సూచించారు. సుదీర్ఘకాలం దైవసేవలో గడిపి పదవీ విరమణ చేసిన అర్చకులు వృద్ధాప్యంలో రోడ్డున పడకుండా పెన్షన్ సౌకర్యం కల్పించాలని, విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు మరణించిన లేదా అనారోగ్యానికి గురైన సిబ్బంది కుటుంబాలకు ప్రత్యేక బీమా పథకం అమలు చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. గత మూడేళ్లుగా నిలిచిపోయిన పీఆర్సీ ప్రయోజనాలు, పెండింగ్‌లో ఉన్న స్పెషల్ ఇంక్రిమెంట్లను వెంటనే విడుదల చేయాలని, పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా వేతన సవరణ చేయడం ప్రభుత్వ బాధ్యతేనని నేతలు స్పష్టం చేశారు. అలాగే అర్చక ఉద్యోగులు, వారి కుటుంబాలకు నగదు రహిత వైద్యం అందించేలా హెల్త్ కార్డులు జారీ చేసి, వారి ఆరోగ్యానికి భరోసా కల్పించాలని కోరారు. ముగింపుగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ఈ సమావేశం హెచ్చరిక కాదని, వేలాది అర్చకఉద్యోగ కుటుంబాల ఆకలి కేకల ప్రతిధ్వని అని ప్రభుత్వం భావించాలని అన్నారు. తమకు వివాదాలు అవసరం లేదని, కేవలం న్యాయమైన వాటా, గౌరవప్రదమైన జీవితం మాత్రమే కావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లా దేవాదాయ శాఖ అధ్యక్షుడు కృష్ణమాచారి, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ఆలయ చైర్మన్ నరసింహ రెడ్డి, స్థానాచార్యులు మల్లన్న స్వామి, ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లన్న, ఉప ప్రధాన అర్చకులు సాంబయ్య, ఆంజనేయులు, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకుడు చంద్రశేఖర్తో పాటు వివిధ దేవాలయాల నుంచి తరలివచ్చిన సుమారు 426 మంది అర్చకులు, దేవాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ వేధింపులు - యువతిని లక్ష్యంగా చేసుకున్న సైబర్ నేరగాడు అరెస్ట్




**మడికొండ, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఓ సైబర్ నేరాన్ని పోలీసులు ఛేదించారు. బట్టుపల్లి గ్రామానికి చెందిన ఓ యువతిని ఆన్‌లైన్‌లో వేధిస్తూ, ఆమె పెళ్లి సంబంధాన్ని చెడగొట్టే ప్రయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బాధిత యువతి 16-12-2025న మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తన కాబోయే భర్తకు, అతని స్నేహితులకు తన పేరుతో అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలు పంపుతున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల విచారణలో నిందితుడు తన గుర్తింపు బయటపడకుండా ఉండేందుకు ఇతరుల వై-ఫై నెట్‌వర్క్‌లను వినియోగిస్తూ, యువతి ముఖాన్ని మార్ఫిడి చేసి అశ్లీల ఫోటోలు, వీడియోలు పంపినట్టు తేలింది. ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు నిందితుడి జాడను గుర్తించి పట్టుకున్నారు. నిందితుడి వివరాలు.. జక్కుల వంశీ (25), తండ్రి: ఓదెలు, నివాసం బట్టుపల్లి గ్రామం. విచారణలోగతంలో యువతిని ప్రేమిస్తున్నానంటూ వెంటపడిన నిందితుడు, ఆమె తిరస్కరించడంతో మనసులో పెట్టుకొని ఆమె పెళ్లి సంబంధం చెడగొట్టాలనే ఉద్దేశంతో ఈ ఆన్‌లైన్ వేధింపులకు పాల్పడినట్టు వెల్లడైంది. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సైబర్ వేధింపులు ఎదురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక వ్యవస్థలతో తెలంగాణ పోలీస్ సైబర్ నేరగాళ్లను తప్పించుకోనివ్వదని స్పష్టం చేశారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన మడికొండ ఇన్స్పెక్టర్ పి. కిషన్, ఎస్ఐ రాజ్ కుమార్, ఐటీ కోర్ ఎస్ఐ కె. సతీష్, ఎఎఓ సల్మాన్ పాషా, సీసీపీఎస్ కాన్స్టేబుల్ ఆంజనేయులు తదితర సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

## మృతురాలి కుటుంబానికి సర్పంచ్ రఘువంశీ పరామర్శ

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**



ఐనవోలు మండల కేంద్రంలోని వరంగల్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ తల్లి నకరకంటి రాంబాయి గురువారం మృతిచెందారు. ఐనవోలు సర్పంచ్ గడ్డం రఘువంశీ గౌడ్, భౌతికయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి కాటబోయిన అశోక్, ఐనవోలు వార్డ్ మెంబర్స్ బత్తుల ప్రవీణ్, దుప్పెల్లి రాజు, మాజీ ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, సీనియర్ నాయకులు పుల్యాల రాజిరెడ్డి, కొత్తూరు రాజు, బండ మహేష్, బాబు, కాటబోయిన చందు మరియు బిఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తిలో ఉచిత కంటి వైద్య శిబిరం

### ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

### వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సేవలు అమోఘం



**హసన్‌పర్తి, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిబిరాన్ని పరిశీలించిన గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూగ్రామీణ ప్రాంత ప్రజలు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా వృద్ధులు, రైతులు, విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ముందస్తుగా సమస్యలను గుర్తించి సకాలంలో చికిత్స పొందవచ్చని తెలిపారు. కంటి ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, చిన్న సమస్య కూడా భవిష్యత్తులో పెద్ద ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. శిబిరంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్‌కు చెందిన అనుభవజ్ఞులైన వైద్యులు, సిబ్బంది ప్రజలకు సమగ్ర కంటి పరీక్షలు నిర్వహించారు. చూపు లోపాలు, కంటి నొప్పులు, కాటరాక్ట్ (ముత్యపుటెర) తదితర కంటి వ్యాధులపై అవగాహన కల్పించి అవసరమైన వారికి సూచనలు అందించారు. కొందరికి ఉచిత మందులు, అద్దాలపై సలహాలు కూడా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి మండల అధ్యక్షులు మారం తిరుపతి, మేకల హరి శంకర్, కుంబర్కర్ సాయి తదితర ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని శిబిరం విజయవంతానికి సహకరించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకోవడంతో శిబిరం విజయవంతంగా ముగిసింది. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని గ్రామ ప్రజలు నిర్వాహకులను కోరారు.

# మేడారం జాతర పిలుపు





### కేసీఆర్ దంపతులను కలిసిన కొండా సురేఖ, సీతక్క

**సిద్దిపేట, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గిరిజన మహోత్సవం మేడారం జాతరకు రావాల్సిందిగా మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కే. చంద్రశేఖర్ రావు (కేసీఆర్) దంపతులను మంత్రులు కొండా సురేఖ, దనసరి సీతక్క ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రులు ఎర్రవెల్లి ఫాంహౌస్కు వెళ్లి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మేడారం జాతర విశిష్టత, గిరిజన సంస్కృతిసంప్రదాయాల ప్రాధాన్యతను వివరించడంతో పాటు, జాతరకు హాజరై గిరిజనుల విశ్వాసాలకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా తొలిసారిగా తమ నివాసానికి వచ్చిన ఆడబిడ్డలను కేసీఆర్‌శోభమ్మ దంపతులు ఆత్మీయంగా స్వాగతించారు. వారికి కానుకలు అందజేసి, ఆశీర్వాదాలు ఇచ్చారు. ఈ భేటీ పూర్తిగా స్నేహపూర్వక, ఆప్యాయ వాతావరణంలో సాగినట్లు సమాచారం. మేడారం జాతర రాష్ట్ర గిరిజన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ మహోత్సవానికి దేశవిదేశాల నుంచి భక్తులు, సందర్శకులు భారీ సంఖ్యలో హాజరవుతారని మంత్రులు పేర్కొన్నారు. ఈ జాతర గిరిజన సంస్కృతి పరిరక్షణకు, సామాజిక ఐక్యతకు ప్రతిబింబంగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

## సంక్రాంతి సాహిత్యసాంస్కృతిక పోటీల గోడపత్రిక ఆవిష్కరణ

**వరంగల్, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, జేబీ కల్చరల్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సంక్రాంతి సాహిత్యసాంస్కృతిక పోటీలకు సంబంధించిన గోడపత్రికను గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజనాల శ్రీహరి మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, గ్రామీణ వ్యవసాయ జీవన విధానానికి ప్రతిబింబమైన సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఇలాంటి సాహిత్యసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇవి సమాజంలో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించడమే కాకుండా, యువతలో సంప్రదాయాల పట్ల ఆసక్తిని పెంచుతాయని అన్నారు. తెలుగు భాషాసంస్కృతి మరుగున పడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇటువంటి కార్యక్రమాల ద్వారా తెలుగు భాష ఉన్నతిని రాబోయే తరాలకు అందించేందుకు సంస్థ చేస్తున్న కృషిని తోట హరీష్ (తెలంగాణ బులియన్ జ్యువలరీ అండ్ జెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ) కొనియాడారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు జడల శివ హరిత మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీ (శనివారం) ఉదయం 10 గంటల నుండి వరంగల్ నగరంలోని పోతన విజ్ఞాన పీఠం ఆడిటోరియం నందు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యాసరచన (ప్రగతి పథంలో దేశాభివృద్ధి), చిత్రలేఖనం (సమైక్య భారతి), కవితలు (సంక్రాంతి విశిష్టత విశేషము), అలాగే ముగ్గుల పోటీ (గొబ్బెమ్మలు, హరిదాసుగంగిరెద్దులు, పతంగులు, సంక్రాంతి శోభ దృశ్యాలు) వంటి విభాగాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం అందజేయడంతో పాటు, ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలకు ఎటువంటి రుసుము లేదని, మహిళలు, విద్యార్థులు, కవులు, కళాకారులు విస్తృతంగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాట్యాచార్యులు భుజంగరావు, ఎంఎస్ఎ జ్యువెలర్స్ అధినేత ఎండి అమీర్, గరిమెళ్ళ మదన్ రావు, పీఆర్ ప్రసాద్, రజిత తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రత మాసం మత్తు పదార్థాల వ్యతిరేక ర్యాలీ






### ఎస్ఆర్ యూనివర్సిటీ కాజీపేట్ ట్రాఫిక్ పోలీస్ సంయుక్త రోడ్ షో

**కాజీపేట, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**

జాతీయ రోడ్డు భద్రత మాసం, మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాల భాగంగా, ఎస్ఆర్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కాజీపేట ట్రాఫిక్ పోలీసుల సహకారంతో శుక్రవారం విస్తృత రోడ్ షోను ఘనంగా నిర్వహించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం, మత్తు పదార్థాల వల్ల కలిగే సామాజికవ్యక్తిగత దుష్ప్రభావాలపై చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీ అంబేద్కర్ జంక్షన్ నుంచి ప్రారంభమై కాళోజి జంక్షన్ వరకు కొనసాగింది. వాహనదారులు, పాదచారులు గమనించేలా శాంతియుతంగా సాగిన ఈ రోడ్ షోకు నగరంలో విశేష స్పందన లభించింది. ర్యాలీ మార్గమంతా ట్రాఫిక్ పోలీసులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపట్టి, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా సమన్వయంతో వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీకి చెందిన సుమారు 800 మంది విద్యార్థులు తమ అధ్యాపకులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి, మద్యం సేవించి వాహనం నడపకూడదు, సీటుబెల్ట్ ధరించాలి వంటి అంశాలపై విద్యార్థులు నినాదాలు చేస్తూ, ఆకర్షణీయమైన ప్లకార్డుల ద్వారా ప్రజలకు స్పష్టమైన సందేశాలు అందించారు. ఈ సందర్భంగా ధర కవిత (డీసీపీ) మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను స్వచ్ఛందంగా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. హెల్మెట్, సీటుబెల్ట్ వంటి భద్రతా చర్యలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, యువత ముందుండి ఆదర్శంగా నిలవాలని సూచించారు. సత్యనారాయణ (ట్రాఫిక్ ఏసీపీ) మాట్లాడుతూ, మత్తు పదార్థాల వినియోగం రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో ఒకటని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రాణాంతకమని, చట్టపరమైన చర్యలతో పాటు సామాజిక అవగాహన కూడా అత్యంత అవసరమని అన్నారు. ఇలాంటి రోడ్ షోలు ప్రజల్లో చైతన్యం పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అలాగే పి. వెంకన్న (కాజీపేట ట్రాఫిక్ ఇన్స్పెక్టర్) మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్లే సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని చెప్పారు. చిన్న తప్పిదం కూడా పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని, యువత ట్రాఫిక్ నియమాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగితేనే రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. ప్రజలు స్వచ్ఛందంగా నియమాలు పాటిస్తూ, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకునే దిశగా ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థినులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రేటర్ వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీవరద కాలువల పునరుద్ధరణపై సమీక్ష





**వరంగల్, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ నగర పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ఏర్పాటు, వరద కాలువల పునరుద్ధరణ అంశాలపై గ్రేటర్ వరంగల్ మేయర్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, గ్రేటర్ వరంగల్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను శాశ్వత పరిష్కారంగా అమలు చేయాలంటే పూర్తిస్థాయి డీపీఆర్ సిద్ధం చేయాలని సూచించారు. నగరం చుట్టూ ఉన్న ఓఆర్ఆర్, చెరువులు, సహజ జలమార్గాలను పరిగణలోకి తీసుకొని వరద కాలువల డీపీఆర్ రూపొందించాలని అన్నారు. చిన్న వర్షానికే ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రాధాన్యతగా నాలాల నిర్మాణం చేపట్టాలని, వరద నీరు నగర బయటకు వెళ్లే మార్గాలను స్పష్టంగా గుర్తిస్తే కాలనీలు ముంపు నుంచి రక్షించవచ్చని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు నాలాల అభివృద్ధిని సమాంతరంగా చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులను ముఖ్యమంత్రి వద్ద ప్రత్యేకంగా కోరుతూ మంజూరు చేయించుకుంటామని చెప్పారు. నగర ప్రజలకు వరద ముంపు సమస్య లేకుండా చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రణాళిక రూపొందించాలన్నారు. డ్రైనేజీ నిర్మాణంలో ఎదురయ్యే సాంకేతిక, భూసేకరణ సమస్యలను ముందుగానే గుర్తించి, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ఆర్అండ్‌బీ విభాగాల అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. నగరాభివృద్ధి, వరద నివారణ చర్యల్లో సమన్వయంతో పనిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.

## కన్నపల్లిలో గంజాయి సరఫరా ముఠా గుట్టు రట్టు - ముగ్గురు అరెస్ట్

**బెల్లంపల్లి, 8 జనవరి 2026(జై భీమ్ న్యూస్)**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని కన్నపల్లి సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో గంజాయి సరఫరా ముఠాను పోలీసులు గుట్టుచప్పుడు కాకుండా బయటపెట్టారు. ఈ ఘటనలో ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మొత్తం 120 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, వాహన తనిఖీల్లో అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరిని ఆపి తనిఖీ చేయగా వారి వద్ద 20 గ్రాముల గంజాయి లభించింది. వారిని విచారించగా, బెల్లంపల్లికి చెందిన మరో వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. వెంటనే ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా దేవయ్య (సీఐ) మాట్లాడుతూ, గంజాయి విక్రయాలు మరియు వినియోగంపై ఎలాంటి సహనం ఉండదని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు అనుమానాస్పద కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మోదీ సర్కారుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

2024 సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు గెలుచుకుని ఉంటే రాజ్యాంగాన్నే మార్చివేసేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మెజారిటీ ఉందన్న కారణంతో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తే అంగీకరించేది లేదని ఆయన స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. మెజారిటీ ఉందన్న అహంకారంతో చట్టసభలను వినియోగించి పేదలను అణిచివేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయం ఇదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ పథకంతో ఎన్నో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నం చేసిందని ఆయన మండిపడ్డారు. అందుకే గత ఎన్నికల్లో 400 సీట్లను లక్ష్యంగా పెట్టుకున్నారని ఆయన అన్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ప్రజలను అప్రమత్తం చేయడంతో బీజేపీ 240 సీట్ల వద్ద ఆగిపోయిందని ఆయన పేర్కొన్నారు. దీనితో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడిందని ఆయన అన్నారు. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకువచ్చారని, దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE



# ‘ది రాజాసాబ్‘కు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్.. పెరగనున్న టికెట్ ధరలు

యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన తాజా చిత్రం ‘ది రాజాసాబ్’కు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ సినిమా టికెట్ ధరలను పెంచుకునేందుకు అనుమతినిస్తూ గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ భారీ బడ్జెట్ చిత్రానికి ప్రభుత్వం రెండు విడతలుగా ధరల పెంపును ఖరారు చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శుక్రవారం నుంచి ఈ నెల 11వ తేదీ వరకు (మొదటి మూడు రోజులు) మల్టీప్లెక్స్‌లలో రూ.132, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.105 మేర ధరలను పెంచుకోవచ్చు. ఆ తర్వాత, అంటే ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకు మల్టీప్లెక్స్‌ల్లో రూ.89, సింగిల్ స్క్రీన్‌లలో రూ.62 అదనంగా వసూలు చేసేందుకు అనుమతినిచ్చారు. అయితే, టికెట్ల ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతాన్ని ఫిలిం ఫెడరేషన్‌కు విరాళంగా ఇవ్వాలని ప్రభుత్వం షరతు విధించింది. హారర్ కామెడీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఈ సినిమాలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కథానాయికలుగా నటించారు. ప్రముఖ బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఎస్.ఎస్. తమన్ అందించిన సంగీతం ఇప్పటికే యువతను విపరీతంగా ఆకట్టుకుంటోంది.

# నిరుద్యోగులపై కాంగ్రెస్ సర్కార్ దమనకాండను ఖండించిన మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

**హైద్రాబాద్, 8 జనవరి 2026 (జై భీమ్ న్యూస్)**



అశోక్‌నగర్‌లో ఉద్యోగాల నోటిఫికేషన్ల కోసం శాంతియుతంగా నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న నిరుద్యోగులపై లాఠీ ఛార్జ్ జరిపిన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యను ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార మదంతో వ్యవహరిస్తూ నిరుద్యోగుల రక్తం కళ్లముందే చూస్తోందని ఆయన విమర్శించారు. నిరుద్యోగులను వాడుకుని అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వారి న్యాయమైన డిమాండ్లను అణిచివేస్తోందని ఆరోపించారు. కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడంతో పాటు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నీటి బుడగలై తేలిపోయాయని తెలిపారు. ‘ప్రజా పాలన’ పేరుతో ప్రజావంచనకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పే రోజు దగ్గర పడిందని హెచ్చరించారు. నిర్బంధాలు వెంటనే ఎత్తివేసి, విద్యార్థినిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగులపై లాఠీ ఛార్జ్ చేసిన పోలీసులను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# దళిత నాయకుడిపై చెప్పుతో దాడి ఘటనపై నిరసన


### అహంకార ఎమ్మెల్యేపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్

### దళిత సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిరసన

**శాయంపేట, జనవరి 082026(జై భీమ్ న్యూస్)**



వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ప్రకారం దళిత నాయకుడిపై అగ్రవర్ణ ఎమ్మెల్యే చెప్పుతో దాడి చేశాడన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించి, సంబంధిత ఎమ్మెల్యేపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శాయంపేట మండల కేంద్రంలో దళిత సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఓటమిని జీర్ణించుకోలేక దళిత నాయకుడిపై అభాండాలు మోపి, తోటి నాయకుల సమక్షంలో చెప్పుతో కొట్టడం అత్యంత హేయమైన చర్యగా తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో గెలుపుఓటములు సహజమని, అయితే కిందిస్థాయి నాయకులపై, ముఖ్యంగా దళిత నాయకులపై దాడులు చేయడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన దళిత జాతిపై బహిరంగ దాడులు చేయడం మనువాద ధోరణిని గుర్తు చేస్తోందని విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యుడైన ఎమ్మెల్యే రాజీనామా చేసి యావత్ దళిత జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలో భాగంగా ఆ ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. వార్తా కథనాలపై సమగ్ర విచారణ చేపట్టి, దోషిగా తేలితే అహంకార ఎమ్మెల్యేపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో దళిత ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుందని నాయకులు హెచ్చరించారు. రానున్న రోజుల్లో దళిత ఓట్ల బలమెంతో చూపిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మారపల్లి క్రాంతికుమార్ (బహుజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు), వంగరి సాంబయ్య (సీపీఐ నాయకులు), అంకేశ్వరపూ ఐలయ్య (దళిత నాయకులు), తుడుం వెంకటేష్ (ఎంఆర్పీఎస్ నాయకులు), మారపెల్లి విజయ్ (బీఎస్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు), మారపల్లి సుధాకర్ (మండల అధ్యక్షులు) తదితరులు పాల్గొన్నారు.



# శివాజీ విషయంలో పాజిటివ్‌గా మాట్లాడిన అనసూయ!

**శివాజీ ఎంతో కష్టపడి ఇండస్ట్రీలో పైకి ఎదిగారన్న అనసూయ**

**ఇతరులు తన మాట వినేంత గౌరవం సంపాదించుకున్నారని వ్యాఖ్య**

**అబ్బాయిలకు కూడా బాధ్యతను గుర్తు చేసి ఉంటే ఈ వివాదమే ఉండేది కాదన్న అనసూయ**

‘దండోరా’ సినిమా ఈవెంట్‌లో హీరోయిన్ల డ్రెస్సింగ్ గురించి సీనియర్ యాక్టర్ శివాజీ చేసిన వ్యాఖ్యలు భారీ వివాదాన్ని రేపిన సంగతి తెలిసిందే. హీరోయిన్లు పద్ధతిగా ఉండాలని, నిధి అగర్వాల్‌కు జరిగిన ఇన్సిడెంట్‌ను ఉదాహరణగా చూపిస్తూ ఆయన మాట్లాడటం అనేక మంది ఆడవాళ్లను కోపం తెప్పించింది. అనసూయ భరద్వాజ్, చిన్మయి శ్రీపాద లాంటి వారు తీవ్రంగా విమర్శలు గుప్పించారు. తప్పు చేసే వాళ్లను వదిలేసి మాకు నీతులు చెబుతారా అంటూ అనసూయ ఫైర్ అవ్వడంతో ఈ గొడవ ‘శివాజీ వర్సెస్ అనసూయ’గా మారిపోయింది. నాగబాబు, ప్రకాష్ రాజ్ లాంటి వారు అనసూయకు మద్దతు పలికారు. సోషల్ మీడియా రెండు వర్గాలుగా విడిపోయింది. కానీ ఇప్పుడు సడెన్‌గా ట్విస్ట్ వచ్చింది. అనసూయ తన రూట్ మార్చి శివాజీ ఉద్దేశాన్ని పాజిటివ్‌గా అర్థం చేసుకుంటూ మాట్లాడారు. శివాజీ ఎంతో కష్టపడి ఇండస్ట్రీలో ఈ స్థాయికి చేరుకున్నారని, ప్రజలు ఆయన మాట వినేంత గౌరవం సంపాదించారని అనసూయ పేర్కొన్నారు. ఆడపిల్లల భద్రత కోసం ఆయన పడిన ఆరాటం వెనుక మంచి ఉద్దేశమే ఉందని ఒప్పుకున్నారు. అయితే కేవలం అమ్మాయిలకు మాత్రమే కాకుండా అబ్బాయిలకు కూడా వాళ్ల బాధ్యతను గుర్తు చేసి ఉంటే ఈ వివాదమే రాదని సున్నితంగా సర్దిచెప్పారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అనసూయ సున్నితమైన ఈ స్పందనతో కొద్ది రోజులుగా సాగుతున్న మాటల గొడవకు ఒక మంచి ముగింపు పడినట్లయింది.